ప్రజాశక్తి

గురువారం 10 నవంబర్ 2022

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

స్టీల్ కార్మికుల కన్నెర్ర

- మోడీ రాక నేపథ్యంలో ఉద్యమం ఉధృతం
- ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు
- వలయాలను ఛేదించి సాగిన పాదయాత్ర
- గాజువాకలో 169 మంది అరెస్టు

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖ పర్యటనలో స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తున్నట్లు ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ఉద్యమం ఉధృతం చేశారు. కూర్మన్నపాలెం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు కార్మికులు తలపెట్టిన బైక్ ర్యాలీని పోలీసులు అడ్డుకున్నా వెరవకుండా పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. అయినా పోలీసులు బారికేడ్లు, రోప్‌లతో అడ్డుకున్నారు. వాటిని తోసుకుంటూ కార్మికులు పాదయాత్ర ప్రారంభించారు. గాజువాక పోలీసు స్టేషన్ జంక్షన్ వద్ద పెద్ద ఎత్తున పోలీసులు చేరుకొని సుమారు 169 మంది కార్మికులను అరెస్టుచేశారు.

కూర్మన్నపాలెం, వడ్లపూడి మధ్యలో బైఠాయించిన కార్మికులు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉక్కునగరం : బుధవారం ఉదయం ఎనిమిది గంటలకల్లా అధిక సంఖ్యలో కార్మికులు కూర్మన్నపాలెం కూడలికి చేరుకున్నారు. బైక్ ర్యాలీ చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తుండగానే వందలాది మంది పోలీసులు మోహరించారు. బైక్ ర్యాలీ చేపట్టడానికి వీల్లేదు అంటూ ఆంక్షలు విధించారు. బారికేడ్లు అడ్డువేసి ర్యాలీని నిరోధించారు. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాల నేతలు మాట్లాడుకుని బైక్ ర్యాలీ కాకుంటే పాదయాత్రగా జివిఎంసి వరకు వెళ్లడానికి నిశ్చయించారు. పోలీసు ఆంక్షల నేపథ్యంలో గాజువాక, పెదగంట్యాడ, వడ్లపూడి ఇలా వేరువేరు దారుల్లో కార్మికులంతా కలిసి పాదయాత్ర చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే పోలీసులు రోడ్లపై నడిచేందుకు సైతం అనుమతి ఇవ్వలేదు. వందలాదిమంది పోలీసుల వలయాన్ని ఛేదించుకుంటూ పాదయాత్రగా బయలుదేరారు. గాజువాక పోలీస్ స్టేషన్ సమీపంలో ఎవరు దొరికితే వారిని అరెస్టు చేసి స్టేషన్ లోపలికి తరలించారు. ముందుగా కార్మిక సంఘాల నేతలను అరెస్టు చేశారు. పోలీసు స్టేషన్‌లో సైతం కార్మిక సంఘాల నేతలు నిరసన వ్యక్తం చేశారు.

డిఆర్‌ఎం కార్యాలయం నుంచి ర్యాలీ...

అఖిలపక్ష కార్మిక సంఘాల ర్యాలీ, సభ

కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయటం లేదని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. డిఆర్‌ఎం కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. అనంతరం అక్కడ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కార్మిక సంఘాల జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయివేటీకరణ చేయరాదన్నారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ సభలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్ రూ.మూడు మిగతా 2లో..

అరెస్టులను ఖండించిన సిపిఎం, సిఐటియు

ప్రజాశక్తి-కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ

విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటూ ప్రధాని ప్రకటన చేయాలని కోరితే అరెస్టులు చేయడం దుర్మార్గమని సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, కె.లోకనాథం, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ పేర్కొన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు చేపట్టే బైక్ ర్యాలీకి అనుమతివ్వకపోవడం, పాదయాత్ర చేస్తున్న కార్మికులను అడ్డుకొని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ అరెస్టులు ప్లాంటు అమ్మాలనుకుంటున్న మోడీ ప్రభుత్వానికి ఊడిగం చేయడం తప్ప ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడేది కాదని విమర్శించారు. ఉద్యమాన్ని బలహీన పరచే కుట్ర అని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంటు రక్షకులపై నిర్బంధం విధించి ప్లాంటును అమ్మాలనే బిజెపి ప్రభుత్వ పక్షాన నిలుస్తారో, ప్రధాని చేత స్టీల్‌ప్లాంటు అమ్మకం నిలుపుదల ప్రకటన చేయించి ప్రజల పక్షాన నిలుస్తారో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తెల్చుకోవాలని డిమాండ్‌చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీరణకు అనుకూలమా? వ్యతిరేకమా స్పష్టం చేయాలని కోరారు. పార్లమెంట్‌లో 22మంది ఎంపీలుంటే మెడలు వంచి రాజన్నపాలన తెస్తామని ప్రగల్బాలు పలికిన ముఖ్యమంత్రి మోదీకి స్వాగతం పలుకుతూ లక్షలాది మందిని సమీకరించి సభలు నిర్వహించడమంటే ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. మోడీ మెప్పుకోసం గంగవరం పోర్టులో ఉన్న ప్రభుత్వ వాటాలను విక్రయించారని విమర్శించారు. రూ.3 లక్షల కోట్లు ఆస్తి కలిగిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేవలం రూ.32వేల కోట్లకు అమ్మేస్తామనడం దుర్మార్గమని పేర్కొన్నారు.

కూల్చివేతలను టిడిపి పరిశీలన

వార్త 2లో..

13న వైజాగ్ నేవీ మారథాన్

వార్త 2లో..

11న బిజెపి రోడ్డు షో : ఎంపీ జివిఎల్

వార్త 2లో..

ప్రధాని సభ విజయవంతమే లక్ష్యం : ఎంపీ విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భారీ బహిరంగ సభను విజయవంతం చేయడమే మనందరి లక్ష్యం కావాలని రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. విశాఖలోని సర్క్యూట్ హౌస్‌లో బుధవారం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ స్థాయిలలోని ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేసేందుకు శాయశక్తులా కృషి చేయాలని కోరారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలలోని 13 నియోజక వర్గాలకు ఇప్పటికే వాలంటీర్లు చేరుకున్నారని, 500 మంది వాలంటీర్లు అక్కడి ఇన్‌ఛార్జిలతో, క్షేత్ర స్థాయి నాయకులను సంప్రదించి ఆయా ప్రాంతాల నుంచి ప్రజలను బహిరంగ సభకు వాహనాల్లో తీసుకురావడంలో ముఖ్యపాత్ర పోషిస్తారని తెలిపారు. 11తేదీ సాయంత్రం 7:30 గంటలకు ప్రధాని విశాఖకు చేరుకుంటారని, రాత్రికి చోళా అతిథి బంగ్లాలో బస చేస్తారని చెప్పారు. 12వ తేదీ ఉదయం ప్రధాని బహిరంగ సభకు చేరుకునే గంట ముందుగానే వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు బహిరంగ సభకు చేరుకునేలా చూడాలన్నారు. 3 లక్షల మంది బహిరంగ సభకు తరలి రావాలన్నది లక్ష్యమని, ఈ మేరకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న వివిధ హోదాలలోని ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు తమ తమ సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాధ్, ఎంపీలు ఎంవివి సత్యనారాయణ, సత్యవతి, విశాఖ, అనకాపల్లి జిల్లాల వైసిపి అధ్యక్షులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కరణం ధర్మశ్రీ, విజయనగరం జిల్లా పరిషత్ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు అదీప్‌రాజు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, ఎమ్మెల్సీలు వంశీకృష్ణశ్రీనివాస్‌యాదవ్, వరుదు కల్యాణి, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం సర్క్యూట్ హౌస్‌లో ప్రధాని సభ ఏర్పాట్లు, ఇతర అంశాలకు సంబంధించి మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరి వెంకట కుమారితో కలిసి సమీక్షించారు. అనంతరం ఎయు ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌కు వెళ్లి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు.

మొదటి పేజీ తరువాయి..

పాదయాత్రగా బయలుదేరిన కార్మికులు

స్టీల్ కార్మికుల కన్నెర్ర

లక్షల కోట్ల ఆస్తి కలిగి ఉందని, కేంద్ర ప్రభుత్వానికి రూ.50 వేల కోట్లను వివిధ పన్నుల రూపంలో చెల్లించిందని తెలిపారు. అలాంటి ప్లాంట్‌ను అమ్మాలని నిర్ణయించడం దుర్మార్గం అన్నారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు పడాల రమణ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించడం లేదని ప్రధాని మోడీ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ వ్యతిరేకమని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్‌చేశారు. సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షుడు ఎన్.కనకారావు మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, నేటికీ ఉపాధి పొందని 8,500 మందికి నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మరికొందరు వక్తలు మాట్లాడుతూ, విశాఖ రైల్వే జోన్‌పై స్పష్టమైన ప్రకటన చేయాలని, వాల్తేరు రైల్వే డివిజన్ తరలింపు విరమించాలని, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని, ఉత్తరాంధ్ర నీటి వనరుల ప్రాజెక్టులకు అవసరమైన నిధులు సమకూర్చాలని, విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్‌చేశారు. సభలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వై.కొండయ్య, సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, కో-కన్వీనర్ కె.ఎం కుమార్‌మంగళం, సిఐటియు నాయకులు బి.జగన్, పి.వెంకటరెడ్డి, బి.వెంకటరావు, జి.అప్పలరాజు, ఎం.సుబ్బారావు, వై.రాజు, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, బి.రమణి, ఎఐటియుసి జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఎం.మన్మధరావు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె రెహమాన్, ఐద్వా విశాఖ జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, జిల్లా కాంగ్రెస్ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు చోడదాసి సుధాకర్, పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, అరుణోదయ కార్యదర్శి కె.నిర్మల, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు బి.కుసుమ, డివైఎఫ్ఐ నగర అధ్యక్షుడు యుఎస్ఎన్.రాజు, పి.కృష్ణారావు, టి. కామేశ్వరరావు, కెవిపి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక పోలీసుస్టేషన్ జంక్షన్‌లో పాదయాత్రను అడ్డుకుంటున్నపోలీసులు

జివిఎంసిలో నూతన వాహనాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ కలెక్టరేట్, విశాఖ

జివిఎంసి జోనల్ కమిషనర్ల కోసం నూతనంగా కొనుగోలు చేసిన బొలేరో వాహనాలను జివిఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ పి.రాజాబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జోనల్ కమిషనర్లకు నూతనంగా 8 బొలేరో వాహనాలను కొనుగోలు చేశామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న వాహనాలు 2011లో కొన్నవి అని, అవి తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని చెప్పారు. వాటి స్థానంలో జోనల్ కమిషనర్లకు ఈ వాహనాలను అందించనున్నట్లు తెలిపారు. జివిఎంసి సాధారణ నిధులు రూ.80 లక్షలతో కొనుగోలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, పర్యవేక్షక ఇంజినీరు కృష్ణారావు, కార్యనిర్వాహణ ఇంజినీర్ సుబ్బారావు, ఉప కార్యనిర్వాహణ ఇంజినీర్ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

కార్లను ప్రారంభిస్తున్న మేయర్, కమిషనర్

కూల్చివేతలను టిడిపి పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : పెద్దవాల్తేరులోని పోలమాంబ గుడి ప్రాంతంలో అధికారులు అక్రమంగా కూల్చివేసిన దుకాణాలు, నివాస సముదాయాలను టిడిపి నాయకులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మీడియాతో మాట్లాడుతూ, ఎయు విసి ప్రసాద్‌రెడ్డి ఈ స్థలంపై కన్ను వేసి ప్రధాని పర్యటనను అడ్డుపెట్టుకొని 70 ఏళ్లుగా నివాసముంటున్న వారి జీవనోపాధిపై దెబ్బ కొట్టారని ఆరోపించారు. ఇక్కడి దుకాణదారులు, నివాసులకు అనుకూలంగా 1998లో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. అయినా జగన్మోహన్‌రెడ్డి అండతో విసి విధ్వంసానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ సంఘటనపై తమ పార్టీ అధిష్టానానికి నివేదిక పంపామని, వెలగపూడి రామకృష్ణ బాబు సారధ్యంలో బాధితులకు అండగా నిలుస్తామని చెప్పారు. వారికి కావాల్సిన న్యాయ సహాయాన్ని అందిస్తామన్నారు. విశాఖలోని భూములను అన్యాక్రాంతం చేయాలన్న లక్ష్యంతోనే జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని ఆరోపించారు. ఎప్పుడో పూర్తయిన ప్రాజెక్టులకు ఇప్పుడు మోడీ ద్వారా శంకుస్థాపన చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, నాయకులు పోతనరెడ్డి పాల్గొన్నారు.

కూల్చివేసిన దుకాణ, నివాస సముదాయాలను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణను విరమించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రభుత్వ రంగంలో నడుస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరించడం విరమించాలని సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షుడు ఎన్.కనకారావు డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 588వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఎఫ్‌టియుఐ మత్స్యకార మహిళలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, కర్మాగారం పూర్తి సామర్థ్యంతో నడిచే చర్యలు చేపట్టాలని, మిగిలి ఉన్న 8500 మంది నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రప్రభుత్వం అనుమతి లేకుండా ఈ కర్మాగారాన్ని ప్రయివేటు వ్యక్తులకు అమ్మే హక్కు కేంద్రానికి లేదన్నారు. ఈ దీక్షల్లో సిఎఫ్‌టియుఐ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.లక్ష్మి, పి.లక్ష్మి, ఎస్.రాజు, జి.వరదేశమ్మ, జి.అనూష్, జి.కిషోర్, ఎయు రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభ గ్రౌండ్‌లో డ్రోన్ల నిషేధం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్ చుట్టూ ఉన్న 5 కిలోమీటర్ల పరిధిలో డ్రోన్‌లను నిషేధించినట్లు విశాఖపట్నం పోలీస్ కమిషనర్ సి.హెచ్ శ్రీకాంత్ బుధవారం ఆదేశాలు జారిచేశారు. 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు నిషేధం అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం 1934 ప్రకారం శిక్షకు గురవుతాని హెచ్చరించారు.

13న వైజాగ్ నేవీ మారథాన్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ, విశాఖ

వైజాగ్ నేవీ మారథాన్‌ను ఈ నెల 13న ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని రేస్ డైరెక్టర్ డాక్టర్ మురళి నన్నపనేని తెలిపారు. బుధవారం ఉదయం వెల్ కం హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వైజాగ్ నేవీ మారథాన్ ఏడవ ఎడిషన్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. విశాఖలో ఆరోగ్యవంతమైన ఫిట్‌నెస్ సంస్కృతి అందించాలనే లక్ష్యంతో రన్నర్స్‌కు మంచి అనుభూతి కలిగించాలనే సంకల్పంతో ఇండియన్ నేవీ స్పోర్ట్స్ ఏరినాతో కలిసి నేవీ మారథాన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మారథాన్‌ను క్లీన్ అండ్ గ్రీన్ వేడుకగా నిర్వహించుటకు కృషి చేస్తున్నామని తెలిపారు. పేపర్ కప్పులను వినియోగించడం, ప్లాస్టిక్ సీసాలు వాడకం తగ్గించటం చేస్తున్నామని చెప్పారు. మారథాన్‌లో పాల్గొనేవారు తాగు నీరు వారే తెచ్చుకోవాలని కోరారు. మారథాన్ రోజున సేకరించిన వ్యర్థాల నుంచి కొన్ని ఉపయోగకరమైన ఉత్పత్తులు తయారుచేసే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. మారథాన్‌లో పాల్గొనదలచిన వారు ఈ నెల 11, 12 తేదీలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల మధ్యన వెల్ కం హోటల్ నందు పేరు నమోదు చేసుకుని రేస్ కిట్ పొందాలని సూచించారు. vizagnavymarathon.com ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మారథాన్ బీచ్ రోడ్ లోని కాళీమాత గుడి నుంచి ఐఎన్ఎస్ కళింగ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ఎస్ కళింగ కమాండింగ్ ఆఫీసర్ నరేష్ వారికో, కేర్ హాస్పిటల్ డాక్టర్ లక్ష్మి, హెరిటేజ్, ఎన్విరాన్‌మెంట్ కార్యకర్త సోహన్ హట్టంగడి, వెల్ కం హోటల్ జనరల్ మేనేజర్ హర్ ముజందర్ గబ్బా తదితరులు పాల్గొన్నారు.

11న బిజెపి రోడ్ షో : జివిఎల్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ, విశాఖ

భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనలో భాగంగా ఆయన విశాఖకు చేరుకోగానే బిజెపి శ్రేణుల ఆధ్వర్యాన భారీ రోడ్ షో నిర్వహించనున్నట్లు రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు తెలిపారు. బిజెపి విశాఖ నగర కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఐఎన్ఎస్ డేగా వద్ద గల మారుతి జంక్షన్ నుంచి నేవల్ డాక్ మీదుగా భారీ రోడ్ షో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులతో నరేంద్ర మోడీ సమావేశం అవుతారని చెప్పారు. 12వ తేదీన కేంద్ర ప్రభుత్వం రూ.15,200 కోట్ల నిధులతో ఆంధ్ర రాష్ట్రంలో తలపెట్టిన ఐదు కార్యక్రమాలకు శంకుస్థాపన, నాలుగు కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, జాతికి అంకితం చేసే కార్యక్రమాలను నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం ఆంధ్ర యూనివర్సిటీలో జరిగే భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తారని తెలిపారు.

ప్రధాని పర్యటనలో రాజధాని, విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి అంశాలు లేవని స్పష్టం చేశారు. రైల్వే జోన్‌పై ఇప్పటికే స్పష్టమయిన ప్రకటన చేశామని, డివిజన్ తరలింపుపై త్వరలో నిర్ణయం ఉంటుందని తెలిపారు. ఇది ప్రభుత్వ అధికారిక పర్యటన అని, పవన్‌కల్యాణ్‌కు ఆహ్వానంపై పిఎంఒ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. పెదవాల్తేరులో షాపుల కూల్చివేతపై మాట్లాడుతూ ప్రధాని పర్యటన కోసం చిరు వ్యాపారుల షాపులు కొట్టేముందు కనీసం నోటీస్ ఇచ్చి ఉండాల్సిందని, ఈ చర్య సమర్థనీయం కాదని పేర్కొన్నారు.

IN THE HON'BLE COURT OF THE XI ADDL. DISTRICT JUDGE AT VISAKHAPATNAM

OS 189/2019

Between
Pasi Srinu & 3others ...Plaintiffs
And
Pasi Narasingarao & 8 others ...Defendants

NOTICE

Defendant No.5
Mathangi Nagamani
W/o late Ravi Kumar
Flat No.09, North Extention
Sithammadhara
Visakhapatnam.

పై నెంబరు దావాను Partition నిమిత్తం దాఖలు చెయ్యగా సదరు దావానందు D5 అయిన మీకు ఎన్ని సార్లు కోర్టు ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకోకుండా తప్పించుకుంటునందున యీ పేపరు ప్రకటన ద్వారా తే 25-11-2022దికి వాయిదా ఉన్నదని తెలియజేయడమైనది. కావున తే.25-11-2022దిన ఉ.10-30నిలకు మీరు పై కోర్టులో స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెల్పగలరు. లేనిచో మీ పరోక్షమందు దావా తీర్మానించడమగును.

By Court Order
PSLK Bharadwaj
Advocate
Bheemunipatnam
Cell: 8309365285
Visakhapatnam
Date: 07-11-2022

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఏలూరు

ఓ.ఎస్. నెం. 405/2019

వాదులు: నూకల శారద మరియు వగైరా
మరియు
ప్రతివాదులు: నూకల రుక్మానందరావు మరియు వగైరా

6వ ప్రతివాది: నామగిరి చంద్రప్రియ, భర్త: చిరంజీవి బాబు, 416/సి, వైజాగ్ స్టీల్ ప్లాంట్, విశాఖపట్నం.

పై నంబరు గల దావా గ్రంధము నందు మీ హాజరు నిమిత్తము సమన్లు మీ అడ్రసునకు అనేక పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిస్టర్ పోస్టు ద్వారాను పంపించననూ, వాటిని మీరు అందుకొని ఉండుటలేదు. అందువలన మీరు ది. 24-11-2022వ తేదీన ఉదయం గం|| 10.30 ని||లకు స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ వాదనలు తెలియపరచుకొనవలెను. అట్లు హాజరు కానిచో మీ పరోక్షములో సదరు దావాను తీర్మానించెదరని ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

గోలి ఉమాశంకర్
వాది తరపు న్యాయవాది, ఏలూరు
ఏలూరు సెల్: 9440186610
తేది: 09-11-22 9441791956

నేడు, రేపు తాగునీరు బంద్

ప్రజాశక్తి- మధురవాడ : పైప్‌లైన్ల మరమ్మతులు కారణంగా ఈ నెల 10,11తేదీల్లో రెండోజోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-2 తాగునీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీరు కెవిఎన్ రవి తెలిపారు. 10న ఆరో వార్డులో ఆర్ హెచ్చాకాలనీ, లక్ష్మీవానిపాలెం, అశోక్‌నగర్, బక్కన్నపాలెం, కొమ్మాది, రేవళ్లపాలెం, రిక్షాకాలనీ, ప్రశాంతినగర్, వైభవ్ నగర్, పల్లీనగర్, ఏడవ వార్డు పాత మధురవాడ, ఎన్‌జిఒ కాలనీ, మిథిలాపురి వుడా కాలనీల్లో నీటి సరఫరా ఉండదన్నారు.

11న ఐదవ వార్డు సాయిరాం కాలనీ, డ్రైవర్స్ కాలనీ, బోరవానిపాలెం, ఆరవ వార్డు సూర్యప్రెస్, కొమ్మాది ఎస్‌సి కాలనీ, దేవీమెట్ట, ఎం1, కె1,2,3, పోతినమల్లయ్యపాలెం, ఆర్ హెచ్ కాలనీ, ఏడ వార్డు కృష్ణనగర్, చంద్రంపాలెం, ఎసిఒకాలనీ, మిథిలాపురి, వుడా కాలనీ, వాంబే కాలనీ, పాత మధురవాడ, ఆర్‌టిసి కాలనీ, ఎనిమిదవ వార్డు మిథిలాపురి వుడా కాలనీల్లో తాగునీటి సరఫరా ఉండదని వెల్లడించారు. ఆయా ప్రాంతాలకు ప్రత్యామ్నాయ విధానాల్లో నీటిని అందిస్తామని తెలిపారు.

18 నుంచి రేడియాలజిస్టుల సదస్సు

ప్రజాశక్తి -మధురవాడ : ఇండియన్ రేడియోలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ ఆఫ్ ఎపి (ఎపిఐఆర్ఐఎ), యుకెకు చెందిన రాయల్ కాలేజ్ ఆఫ్ రేడియాలజిస్ట్ సంయుక్త ఆధ్వర్యాన ఈ నెల 18 నుంచి 20 వరకు గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చిలో సదస్సు నిర్వహిస్తున్నాయని జిమసర్ రేడియాలజీ విభాగాధిపతి బి.కె. దుర్గాప్రసాద్ తెలిపారు. భారత్, యుకెలకు చెందిన ప్రముఖ రేడియాలజీ నిపుణులు డాక్టర్ రాధేష్ లాలం, డాక్టర్ హరుణ్ గుప్తా, డాక్టర్ యారోస్లావ్స్కీ, డాక్టర్ దానూబ్ దలిలి పాల్గొని, వైద్య రంగంలో రేడియాలజీకి సంబంధించిన నూతన ఆవిష్కరణలపై శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు. పూర్తి వివరాలకు ఎపిఐఆర్ఎ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎస్. గురు ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ బి.సురేష్‌ను సంప్రదించాలన్నారు.

మహిళలకు స్వయంఉపాధి శిక్షణ

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని రేవిడి, పద్మనాభం గ్రామాల్లో 120 మంది మహిళా సంఘాల సభ్యులకు బుధవారం విద్య ఫౌండేషన్, ఎంఆడి సేవాసంస్థ ఆధ్వర్యంలో నాబార్డు సాయంతో స్వయంఉపాధిపై శిక్షణ ఇవ్వనున్నట్లు విద్య ఫౌండేషన్ అధ్యక్షుడు వి.ప్రసాద్ తెలిపారు. పద్మనాభంలో విద్య ఫౌండేషన్ ద్వారా హవాయి చెప్పుల తయారీపై 90 మంది మహిళలకు 15 రోజులు శిక్షణ ఇస్తామన్నారు. రేవిడిలో 30మంది సభ్యులకు బాల్‌పాయింట్ పెన్నుల తయారీపై ఎంవిడి సేవా సంస్థ ఆధ్వర్యంలో శిక్షణనిస్తామన్నారు. శిక్షణాకాలంలో రోజుకు రూ.50 చొప్పున రూ.750 భృతి చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో నాబార్డు డిడిఎం శ్రీనివాసరావు, నీడ్ బ్యాంకు మేనేజర్ వివిస్ చర్య, రేవిడి సర్పంచ్ ప్రతినిధి కోన రమణ, పద్మనాభం సర్పంచ్ ప్రతినిధి తాలాడ పద్మనాభం పాల్గొన్నారు.

'జలజీవన్ మిషన్'పై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం: ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించడమే జలజీవన్ మిషన్‌పథక ఉద్దేశ్యమని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సుబ్బలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో జలజీవన్ మిషన్ పథకం అమలుపై దంతులూరి వెంకట శివ సూర్య నారాయణ రాజు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. పథకం అమలు పర్యవేక్షణ నిమిత్తం 15 మందితో కమిటీలు ఏర్పాటు చేస్తామని, వారిలో సగం మంది మహిళలే ఉంటారన్నారు.

దంత వైద్య కళాశాలలో రేడియాలజీ డే

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాలలో బుధవారం రేడియాలజీ డే నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ, రేడియాలజీ డే ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో రేడియాలజీ విభాగపు అధిపతి డాక్టర్ బి రామకృష్ణ, దంత వైద్యులు ,సిబ్బంది పాల్గొన్నారు.

హార్లిక్స్, వాటర్ బాటిళ్లు పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : దివీస్ ఆధ్వర్యంలో చిట్టివలస జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలోని 203 మంది విద్యార్థినులకు రూ 1,18,475 లు విలువైన హార్లిక్స్, ఎస్-ఎస్ వాటర్ బాటిళ్లను బుధ వారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ బాలామణి, హెచ్ఎం రోజామణి, ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు సురేష్ కుమార్, శేఖర్ బాబు, ఫణీంద్ర పాల్గొన్నారు.

ప్రధాని మోడీ సభ ఏర్పాట్లపై సమీక్ష

మాట్లాడుతున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఈనెల 12న ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరిగే ప్రధాని మోడీ, సిఎం జగన్ బహిరంగసభను విజయవంతం చేయాలని విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ ఛైర్మన్ కెకె. రాజు కోరారు.బుధవారం అక్కయ్యపాలెం షాదీఖానా కల్యాణ మండపంలో జివిఎంసి అధికారులు,నియోజకవర్గ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జోనల్ కమిషనర్లు ఆర్‌జివి కృష్ణ ,విజయలక్ష్మి, జివిఎంసి ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాస్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు సారిపల్లి గోవింద్, బర్కత్ అలీ, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతిశ్రీనివాస్, పి.ఉషశ్రీ, కె.కామేశ్వరి, రెయ్యి వెంకటరమణ, చల్లా రజినిఈశ్వరరావు, మాజీ కార్పొరేటర్లు బులుసు జగదీశ్, పోతు సత్యనారాయణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

23న అనంత పద్మనాభుని దీపోత్సవం

ఏర్పాట్లపై కోఆర్డినేషన్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి-పద్మనాభం : ఈనెల 23న నిర్వహించనున్న అనంత పద్మనాభస్వామి దీపోత్సవాన్ని అన్ని శాఖల అధికారులు, నేతలు, ప్రజలు, భక్తుల పరస్పర సమన్వయం, సహకారంతో విజయవంతం చేయాలని ఎంపికి కె.రాంబాబు కోరారు. బుధవారం పద్మనాభంలోని అనంత పద్మనాభుని ఆలయ ప్రాంగణం, కుంతీమాధవస్వామి ఆలయ సామాజిక భవనంలో ఇఒ కీర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, గడిచిన రెండేళ్ళ కోవిడ్ కారణంగా దీపోత్సవానికి భక్తులను పూర్తిస్థాయిలో అనుమతించని పరిస్థితుల్లో ఈ ఏడాది అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున లక్షల్లో భక్తులువచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు లేకుండాచూసుకోవాలన్నారు. కొండపైకి వాహన రాకపోకలను పోలీసులు అనుమతించనప్పటికీ, ప్రసాదం, తాగునీటి ప్యాకెట్లు, ఇతర సరుకులు తీసుకెళ్లే వాహనాలకు పోలీసులు అనుమతించాలని కోరారు. మెట్లమార్గంలో ఉన్న ఆక్రమణలన్నీ తొలగిపోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఇఒ శ్రీనివాసరావు దీపోత్సవ ఏర్పాట్లకు సంబంధించి 26అంశాలతో కూడిన నివేదికను సమావేశంలో సమర్పించారు. కార్యక్రమంలో సింహచలం దేవస్థానం ఎఇఒ జె శ్రీనివాసరావు, సింహచలం ఆర్‌టిసి డిపో మేనేజర్ రాజశేఖర్, విజయనగరం అసిస్టెంటు మేనేజర్ ఆదినారాయణ, ఎండోమెంట్ అధికారి వివిఎస్ మూర్తి, తగరపువలస అగ్నిమాపక విభాగం ఎస్‌ఐ కె చక్రవర్తి పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-పద్మనాభం: ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం రాయితీలను ఇస్తూ ప్రోత్సాహిస్తోందని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవనశాఖాధికారి మన్మధరావు అన్నారు. బుధవారం మండలంలోని కోరాడలో సర్పంచ్ కోరాడ లక్ష్మణరావు సౌజన్యంతో శారద వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి ఆధ్వర్యంలో ఉద్యానవన పంటల సాగుపై రైతులకు ఒకరోజు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా మన్మధరావు కార్యక్రమంలో మాట్లాడుతూ, ఎపిఐఐ ఎటిపి పథకంలో ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. రెగ్యులర్ పంటలకు ప్రత్యామ్నాయంగా ఆరుతడితో పండే ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలను సాగువైపు రైతులు ఆసక్తి చూపాలని కోరారు. భీమిలి సబ్‌డివిజన్ హార్టీకల్చర్ అధికారి స్వాతి మాట్లాడుతూ, సబ్‌డివిజన్ పరిధిలోని భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాల్లో కూరగాయలు, పూలసాగు అధిక విస్తీర్ణంలో ఉందని,వీటిని మరింతగా ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వినియోగించుకోవాలని రైతులను కోరారు. జెడ్‌పిఎన్‌ఎఫ్ డివిజనల్ అధికారి వెంకటరావు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల తయారీ. వాటి ఉపయోగాలపై అవగాహన కల్పించారు.

ప్రత్యేక హోదాతోనే ఎపి అభివృద్ధి

ప్రజాశక్తి -తగరపువలస :విభజిత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక హోదా ఇవ్వాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి రామ్ కోరారు. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ, విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ ప్రత్యేకహోదాపై సానుకూల ప్రకటన చేయాలని, ఎపికి ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన సాగుతోందని, పర్యాటకంగా అభివృద్ధి చెందిన రుషికొండ ప్రాంతాన్ని వైసిపి ప్రభుత్వం ధ్వంసం చేసిందని, విశాఖ వస్తున్న ప్రధాని మోడీ దీనిపై ప్రత్యేకంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు.

తెలుగుకు ఊపిరి పోసిన బ్రౌన్

ప్రజాశక్తి-సీతమ్మధార : తెలుగు భాష సాహిత్యాలు నిర్లక్ష్యానికి గురైన కాలంలో ఒంటిచేతితో వాటికి ఊపిరిపోసి బతికించిన వ్యక్తి సిపి బ్రౌన్ అని డాక్టర్ సూరపనేని విజయ్‌కుమార్ అన్నారు బుధవారం పౌరగ్రంథాలయంలో పరవస్తు బ్రిడ్జెట్, తెలుగు దండు ఆధ్వర్యంలో బ్రౌన్ జయంతి నిర్వహించారు. అమూల్యమైన తాళపత్ర గ్రంథాలను సేకరించి సంస్కరించి. పరిష్కరించి. ముద్రించి తెలుగు భాష సాహిత్యాలకు ఎనలేని గౌరవ స్థానాన్ని తెచ్చిపెట్టిన మహోన్నత వ్యక్తి బ్రౌన్ అని కొనియాడారు. కార్యక్రమంలో చిన్న సూరి ధర్మవతి పంతులు, లలిత కామేశ్వరి శర్మ, సారిపల్లి మంగమణి, శ్రీనివాస్, ధనుంజయ్, కవులు రచయితలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఖోఖో పోటీలకు అలేఖ్య

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని విజయానందపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని అలేఖ్య జిల్లాస్థాయిలో అండర్ -14 విభాగంలో ఖోఖో పోటీలకు ఎంపికైందని పాఠశాల హెచ్ఎం పి.నిర్మల తెలిపారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన అలేఖ్యను అభినందించారు. పిఇటిలు వరాలమ్మ, ఆర్.శంకర్ పాల్గొన్నారు.

బాధితునికి సాయం అందజేత

ప్రజాశక్తి- పెందుర్తి : ప్రమాదంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మండలంలోని వాలిమేరక జుత్తాడ పంచాయతీ దువ్వపాలెం గ్రామానికి చెందిన చిట్టిబోయిన చిన్నారావుకు స్థానిక సర్పంచ్ చంద్రవాని ప్రకాష్, ఇంరా లారీల యాజమాన్యం సమకూర్చిన ఆర్థికసాయంతో నిత్యావసరాలు, నగదును బుధవారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీను, రమణ, కనకరాజు, ఈశ్వర, సత్తిబాబు పాల్గొన్నారు

బ్లాక్ ఫంగస్ బాధితునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఆరిలోవ : బ్లాక్ ఫంగస్‌తో బాధపడుతున్న వైసిపి కార్యకర్త విజయ్‌కుమార్‌కు 11వ వార్డు వైసిపి కార్యకర్తలు అండగా నిలిచారు. తలోచేయి వేసుకుని రూ.50వేల ఆర్థిక సాయాన్ని పోగు చేశారు. బుధవారం వార్డు వైసిపి కార్యాలయంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ద్వారా బాధితునికి అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.. కార్యక్రమంలో వైసిపి నేత గొలగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుని హఠాన్మరణం

- దిబ్బిడిపాలెంలో విషాదఛాయలు

నివాళులర్పిస్తున్న నేతలు, ఇన్‌సెట్లో విజయ్ ఫైల్‌ఫోటో

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని గిడిజాల పంచాయతీ దిబ్బిడిపాలెం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కర్రి విజయ్ (26) హఠాన్మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన కర్రి వెంకటరావు, సూరమ్మ దంపతుల ఇద్దరు పిల్లల్లో ఏకైక కుమారుడు విజయ్, బిటెక్ చదివి, నగరంలోని ఎన్ఎడి వద్ద ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం విరోచనాలతో ఆలసటగా ఉందని చెప్పడంతో వెంటనే ఆయుష్మాన్ ఆసుపత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృత్యువాత పడ్డాడు. చేతికి అందొచ్చిన కొడుకు హఠాన్మరణంతో అతని తల్లిదండ్రులు, సోదరి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. భీమిలి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను, వైసిపి నేత కోరాడ ముసలినాయుడు, కనమాం సర్పంచ్ ఆబోతు అప్పలరాము, పలువురునేతలు,ప్రజాప్రతినిధులు విజయ్ భౌతికకాయానికి నివాళులర్పించి, ఆ కుటుంబ సభ్యులను ఓదార్చారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - కంచరపాలెం : 56వ వార్డు గవర కంచరపాలెం ఆంజనేయస్వామి ఆలయం రైల్వేట్రాక్ సమీపంలోని గెడ్డలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైంది. దీనిపై స్థానికులు నుంచి అందిన సమాచారం మేరకు కంచరపాలెం పోలీసులు పరిశీలించారు. దీనిపై పోలీసులు అందిన వివరాల ప్రకారం మృతదేహం ముఖంపై గాయాలున్నాయని, దీంతో అనుమానాస్పద మృతిగానే భావిస్తున్నామన్నారు. మృతుని వయస్సు 40-45ఏళ్ల వయస్సు ఉంటుందని, చనిపోయి మూడు రోజులు కావచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి కెజిహెచ్‌కు తరలించారు. సిఐ విజయకుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోర్ట్ స్టేడియం వద్ద రోడ్డు ప్రమాదం

ప్రజాశక్తి -కంచరపాలెం : అక్కయ్యపాలెం పోర్ట్ స్టేడియం వద్ద బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొనడంతో ఒక్కసారిగా కారు డివైడర్ పైకి వెళ్లింది. సేకరించిన వివరాల మేరకు మద్దిలపాలెం నుంచి వస్తున్న ఓ కారు పోర్ట్ స్టేడియం వద్ద సర్వీసు రోడ్డులోకి రాగా ఎదురుగా వస్తున్న ఓ బొలెరో వాహనాన్ని తప్పించి బోయి డివైడర్ పైకి వెళ్లింది ఈ ప్రమాదంలో కారు డ్రైవర్‌కు స్వల్పగాయాలు య్యాయి.సంఘటనా స్థలానికి చేరుకున్న నాలుగవ పట్టణ పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారని పోలీసులు తెలిపారు.

బస్సు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

సెక్యూరిటీ గార్డు హరికృష్ణ

ప్రజాశక్తి -కంచరపాలెం : నడుస్తున్న బస్సులోంచి జారిపడడంతో ప్రైవేటు సెక్యూరిటీ గార్డు గాయపడిన ఘటన బుధవారం బిర్లా జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగరంలోని ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలో గార్డుగా పనిచేస్తున్న జి.హరికృష్ణ, బుధవారం గోపాలపట్నం వైపు సిటీ బస్సులో వెళుతూ, బిర్లా జంక్షన్ దగ్గరలో బస్సు నుంచి జారి రోడ్డుపై పడిపోయాడు దీంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. హరికృష్ణకు మూర్ఛ వ్యాధి ఉందని స్థానికులు అంటున్నారు. కంచరపాలెం సిఐ. ఎస్.విజయకుమార్ నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్లపై దౌర్జన్యం తగదు

సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న ఆటోడ్రైవర్లు

ప్రజాశక్తి- పిఎం పాలెం: ఆటో రిక్షా డ్రైవర్లపై ఆర్‌టిఎ అధికారులు జులుం ప్రదర్శిస్తున్నారని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం, సిఐటియు నగర అధ్యక్షులు పి.రాజ్‌కుమార్ అన్నారు. ఆటో డ్రైవర్లపై దౌర్జన్యం, బెదిరింపులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో మధురవాడ జోనల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ, నగరంలో ప్రధాని, ముఖ్యమంత్రి, ఇతర విఐపిలు వస్తే ఆటోడ్రైవర్లు ఆందోళన చెందాల్సిన పరిస్థితులు కల్పిస్తున్నారని, ఇది చాలా అన్యాయమన్నారు. బుధవారం ఆర్‌టిఎ అధికారులు, సిబ్బంది వచ్చి మధురవాడలోని అన్ని ఆటో స్టాండ్ల ఆటోలను ఈనెల 12న ప్రధాని మోడీ సభకు తరలించాని ఆదేశించారన్నారు. గతంలోనూ ముఖ్యమంత్రి కార్యక్రమాలకు రెండుసార్లు బలవంతంగా ఆటోలు పెట్టించారన్నారు. రోజంతా తిప్పించి, ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. ఇపుడు ఆటోలు పెట్టకుంటే, 13న వచ్చి ఒక్కొక్కరికీ రూ.20వేలు వరకు జరిమానాలు విధిస్తామని బెదరించి వెళ్లారన్నారు. ఆర్‌టిఏల జులుం, బెదిరింపులు ఆపకపోతే, రవాణాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జి చిన్నారావు, డి రవి, ఆటో యూనియన్ జోన్ కార్యదర్శి టి రమేష్ బాబు, కె. వీరు బాబు, కె.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

చైతన్యలో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్‌డే

వేడుకల్లో పాల్గొన్న చిన్నారులతో గ్రాండ్‌పేరెంట్స్

ప్రజాశక్తి -పిఎం పాలెం: మధురవాడ బక్కన్నపాలెం రోడ్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులు తమ గ్రాండ్ పేరెంట్స్‌తో కలిసి సందడి చేశారు. వారి వేషధారణలు, నృత్యాలు, తమ తాతఅవ్వల స్వభావాలను అనుకరించడం వంటి చిన్నారుల చర్యలు చూపరులను ఆకట్టుకున్నాయని ప్రిన్సిపాల్ సందీప్ తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల శ్రీ చైతన్య పాఠశాలల ఎజిఎం సురేష్, పాఠశాలల రీజినల్ ఇన్‌ఛార్జి ఆశిబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ జ్యోతి, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి దీప్తి, ఉపాధ్యాయులు పాల్గొని చిన్నారులకు అభినందించారు.

లోడగలవానిపాలెంలో 'ఫ్యామిలీ ఫిజిషియన్'

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శైలజ

ప్రజాశక్తి -ఆనందపురం: లోడగలవానిపాలెం సచివాలయంలో బుధవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక వైద్యాధికారి డాక్టర్ కోరాడ శైలజ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక రోగులను గుర్తించి వారికి ఇంటి వద్దనే వైద్యం అందించారు. మధ్యాహ్నం పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ లొడగల రాజేశ్వరి రమణ ప్రారంభించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమణ, వైసిపి నేత పాండ్రంకి అప్పారావు, సిహెచ్ఒ అరుణ, హెల్త్ సూపర్వైజర్ ఐ.గోవిందరావు, ఎఎన్ఎం దేవి, ఆశ వర్కర్లు పాపయమ్మ, సెక్రెటరీ అనురాధ పాల్గొన్నారు.

ఆర్గానిక్ కంపెనీ స్టాల్ కోసం

రైతుల దుకాణాలు తొలగింపు

- సీతమ్మధార రైతుబజారులో ఆందోళన
- స్థలం లేక రోడ్డున పడిన వ్యాపారాలు
- లబోదిబోమంటున్న బాధితులు

అధికారులు కూల్చేసిన రైతుల దుకాణాలు

ప్రజాశక్తి- సీతమ్మధార: ఆర్గానిక్ కంపెనీ స్టాల్ ఏర్పాటుకు రైతుల దుకాణాలను కూల్చివేయడంపై సీతమ్మధార రైతుబజారులో రైతువ్యాపారులు ఆందోళన చేశారు. దాదాపు 22ఏళ్లుగా తాము రైతుబజారులో కూరగాయలను విక్రయిస్తున్నామని, ఇపుడు తామున్న దుకాణాలను కూల్చేసి, ఆర్గానిక్ కేటాయించడం వల్ల తాము ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుబజారులో అరకొరగా ఉన్న 32స్టాల్స్‌లోనే ఉదయం కొంతమంది, మధ్యాహ్నం మరికొంతమంది రైతులు వంతుల వారీగా వ్యాపారం చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇపుడు ఉన్నస్టాల్స్‌లో సుమారు పదిమంది రైతులు దుకాణాలు వేసే స్థలంలో ఆర్గానిక్ కంపెనీకి కేటాయించడం వల్ల తామంతా రోడ్డున పడతామని వాపోతున్నారు. ప్రస్తుతమున్న షెడ్‌లను తొలగించడంతో ఎండలోనే వ్యాపారాలు చేస్తున్నామని, దీంతో కూరగాయలు ఎండి పాడౌతుండడంతో నష్టపోక తప్పదని అంటున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళితే ఉన్నదాంట్లోనే సర్దుకోవాలంటూ చెప్పి చేతులు దులుపుకుంటున్నారని, అదెలా సాధ్యమో వారు చేయాలని వేడుకుంటున్నారు.

ఎండకు కూరగాయలు పాడౌతున్నాయి

చోడవరం నుంచి కూరగాయలను తెచ్చి, కేటాయించిన స్టాల్‌లోనే ఇన్నాళ్లు విక్రయించాను. ఇపుడుతమ స్థానాన్ని వేరే వాళ్లకు కేటాయించారు. దీంతో దుకాణం లేక రోడ్డుపైనే విక్రయించే పరిస్థితి వచ్చింది. ఎండ వల్ల కూరగాయలు పాడౌతున్నాయి.

-రాజశ్రీ, మహిళా రైతు

ఉన్న స్టాల్స్‌లోనే రైతులకు సర్దుబాటు

ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వులు మేరకు ఆర్గానిక్ కంపెనీకి స్థలాన్ని కేటాయించాల్సి వచ్చింది. దీంతో కొన్ని స్టాల్స్‌ను తొలగించాల్సిన పరిస్థితి. ఉన్న స్టాల్స్‌లో రైతులందరికీ సర్దుబాటు చేస్తాం.

యాసిన్, ఏడీ, మార్కెటింగ్ శాఖ

కూరగాయలు ఎక్కడ అమ్ముకోవాలి

20ఏళ్లుగాఇదే స్థలంలో కూరగాయలు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాను. తాము వ్యాపారం చేసుకునే స్థలాన్ని ఆర్గానిక్ కంపెనీకి ఇచ్చేస్తున్నారు. తెచ్చిన కూరగాయ లను ఎక్కడ అమ్ముకోవాలో తెలియని పరిస్థితి. మా స్థలాలు మాకే కేటాయించాలి.

-వై సత్యవతి, మహిళా రైతు

కనీస పింఛను రూ.తొమ్మిది వేలు ఇవ్వాలి

మాట్లాడుతున్న పెన్షనర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్

ప్రజాశక్తి -మధురవాడ :సేవ, ఉత్పత్తిరంగంలో సేవలందించిన విశ్రాంత ఉద్యోగులకు కనీస పింఛను రూ.9వేలు చెల్లించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఎనిమిదవ ఆర్డు బింద్రానగర్, సుందరయ్య పార్కులో రెడ్డిపల్లి బాబూరావు అధ్యక్షతన నిర్వహించిన పెన్షనర్స్ యూనియన్ విశాఖ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు పెన్షనర్లను నిరాశపరిచేదిగా ఉందని, 2014కు ముందు ఉద్యోగ విరమణ చేసిన వారికే వర్తిసుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమలు, ప్రైవేటు, సొసైటీల్లో పనిచేసి రిటైరైన వారికి రూ.మూడు వేలు పింఛను రావడం కష్టమౌతోందన్నారు. ప్రస్తుత ధరాభారం, పన్నుల మోతతో పెన్షనర్ల జీవనం ఎలా సాగుతుందో ప్రభుత్వాలు ఆలోచించాలన్నారు. ఈ నేపథ్యంలో కరువు భత్యం, ఇతర సౌకర్యాలతో కనీస పింఛను రూ.9వేలు చెల్లించాలని కోరుతూ ఈనెల 16న జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వచ్చేనెల 7, 8 తేదీల్లో పెన్షనర్ల సమస్యలపై ఢిల్లీలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు వి తులసీరాం, ఇ.శేషగిరిరావు, వి అప్పారావు, ఆర్.బాబూరావు, వై అప్పారావు, సిఐటియు నాయకుడు డి.అప్పలరాజు పాల్గొన్నారు.

అప్పయ్యమ్మకు ఘన నివాళి


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వంశీరెడ్డి

ప్రజాశక్తి- గాజువాక : 74వ వార్డు సిద్దేశ్వరంలో నందికి అప్పయ్యమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పయమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు సమకూర్చిన దుప్పట్లు, పండ్లును వృద్ధులు, వికలాంగులు, పేద మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, అప్పయ్యమ్మ కుమారుడు నందికి తాతారావు, పులి వెంకటరమణారెడ్డి, మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, గొందేశి వెంకటరమణ రెడ్డి, తోకాడ అప్పా రావు, మొల్లి పెంటిరాజు, కణితి అప్పలరాజు, గొర్లు సత్యం, పాల అప్పలరెడ్డి, నందికి అప్పలరెడ్డి, రావాడ శివ, నందికి చిన్నారావు, గొందేశి ప్రభాకరరెడ్డి, పాల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్నియా మార్పిడితో కంటిచూపు పునరుద్ధరణ

డాక్టర్ ముకుందన్

ప్రజాశక్తి - ఆరిలోవ : కార్నియా మార్పిడితోనే కంటిచూపును పునరుద్ధరించవచ్చని ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ కార్నియా కన్సల్టెంట్ డాక్టర్ ముకుందన్ అన్నారు. మంచి చూపుకు ఆరోగ్యవంతమైన కార్నియా తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్నియా గాయపడినా, వాచినా, దెబ్బతిన్నా కంటిలోకి కాంతి కేంద్రీకరించబడదన్నారు. దీనితో చూపు అస్పష్టమవుతుందన్నారు. దేశంలో దాదాపు రెండు మిలియన్ల మంది కార్నియా అంధత్వంతో బాధపడుతున్నారని, వీరిలో 60 శాతం మంది 12ఏళ్ల లోపు వారే ఉన్నారన్నారు. నగరంలో ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో అన్ని రకాల ప్రక్రియలలో నైపుణ్యం గల అనుభవజ్ఞులైన నేత్ర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు.

బాలల హక్కులపై ప్రచారం కల్పించండి

గౌతమ్‌రెడ్డితో మాట్లాడుతున్నగొండు సీతారాం

ప్రజాశక్తి- సిరిపురం : బాలల హక్కులు, వారి పరిరక్షణ చట్టాలపై రాష్ట్ర ఫైబర్ నెట్ సంస్థ ద్వారా అన్ని జిల్లాల్లో ప్రసారమయ్యే లోకల్ ఛానెళ్లలో విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలని ఎపి ఫైబర్‌నెట్ ఛైర్మన్ పి.గౌతమ్ రెడ్డిని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం కోరారు. బుధవారం ఎంవిపి.కాలనీలో ఆయనతో సమావేశమయ్యారు. బాలల హక్కుల పరిరక్షణ చట్టాలైన పోక్సో, ఆర్‌టిఐ, కారా, దత్తత చట్టాలతోపాటు బాల్య వివాహాలు, బాల కార్మిక నిషేధ చట్టం, జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు విధి విధానాలు, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ విధులు, అధికారాలపై అవగాహన కలిగేలా విస్తృత కార్యక్రమాలు, స్క్రోలింగ్ ద్వారా ప్రచారం చేయాలని కోరారు. దీనిపై గౌతమ్‌రెడ్డి స్పందిస్తూ, తక్షణమే తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జివిఎంసి స్టాఫ్.వర్కర్స్ యూనియన్ సెక్రటరీ జనరల్ వి.వి.వామనరావు, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం విశాఖ నగర కన్వీనర్ కె.ఎల్లయ్య పాల్గొన్నారు

బాధ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న దళితులు

ప్రజాశక్తి -భీమునిపట్నం: మండలంలోని అమనాంలో దళిత యువకుడు సారిక సాయిగణేష్ మోటారు బైక్‌ను తగులబెట్టిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ భీమ్‌సేన్ వార్ ఆధ్వర్యంలో బుధ వారం స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట దళితులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా భీమ్‌సేన్ వార్ ప్రధాన సలహాదారు ఎస్ఆర్ వేమన మాట్లాడుతూ, దళిత యువకుని బైక్ దగ్ధం చేసిన కేసులో 45రోజులౌతున్నా పోలీసులు స్పందించకపోవడం దారుణమన్నారు. జోన్‌కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, బాధితునికి న్యాయం జరిగే వరకు అన్ని దళిత సంఘాలతో పోరాడతామన్నారు. భీమ్‌సేన వార్ ఉపాధ్యక్షులు దుర్గారావు, బాలకృష్ణ, స్థానికనేతలు శ్రీను, రవి, మహేష్, సుబ్బారావు, భాగం లక్ష్మి పాల్గొన్నారు.

ఎంపిపి సంఘీభావం..

దళితుల ఆందోళనకుఎంపిపి దంతులూరి వెంకట శివసూర్య నారాయణ రాజు సంఘీభావం తెలిపారు. బాధితునికి న్యాయం చేయాలని కోరారు. లేకుంటే బాధిత దళితులతో కలిసి ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొంటామన్నారు.

అడ్డదారుల్లో ఇసుక దందా

- నిర్మాణాల పేరుతో ఇసుక రప్పించి రిటైల్‌గా అమ్ముతున్న వైనం
- పాత్రికేయుల ఫిర్యాదుతో దాడులు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

లారీతో వచ్చిన ఇసుకను ట్రాక్టర్‌కు అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - యలమంచిలి

ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ఇసుకాసురులు ఏ మార్గంలో తమ ఇసుక అక్రమ వ్యాపారం సాగితే ఆ మార్గంలో కానిచ్చేస్తున్నారు. ఇలాగే నిర్మాణాల పేరుతో ఇసుక బుక్ చేసి, దానిని రప్పించి రిటైల్‌లో అధిక ధరకు అమ్మకాలు సాగిస్తున్న చీకటి కోణం బుధవారం వెలుగు చూసింది. ఇందులో రాజకీయ నాయకుల పేర్లు కూడా వాడుకోవడం విశేషం. బుధవారం ఉదయం యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా వ్యవసాయశాఖ ఏడి కార్యాలయం లో వ్యవసాయాధి కారుల సమావేశానికి విలేకర్లు హాజరయ్యారు. ఈ సమయంలో దొంగచాటుగా ఇసుక తరలిస్తున్న వైనాన్ని విలేకర్లు గుర్తించారు. వెంటనే ఈ సమాచారాన్ని ఇసుక స్పెషల్ ఇన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ జనార్దన్‌కు తెలియజేయగా, మధ్యాహ్నం 3 గంటల సమయంలో వారు నేర స్థలానికి చేరుకున్నారు. ఇసుకతో వచ్చిన భారీ లారీ అనుమతులు, రిటైల్‌గా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ యజమాని రామలక్ష్మణ్ దగ్గర కాగితాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలని, విచారణ పూర్తయ్యే వరకూ వాహనాలను అక్కడే ఉంచాలని ఆదేశించారు. ఇసుక లబ్దిదారుల్ని స్టేషన్‌కు రప్పించి వారి వివరణ తీసుకుంటామని ఎస్‌ఐ చెప్పారు. గురువారం ఉదయం కేసు పూర్వాపరాలు విచారించి, తగిన నిర్ణయం తీసుకుంటామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ జనార్దన్ చెప్పారు. ఇక్కడ నిర్మాణదారుల పేరుతో ఇసుక బుక్ చేసి, దానిని ఖాళీ స్థలాల్లో నిల్వ చేసి రిటైల్‌గా ట్రాక్టర్లు, గోనె సంచులతో అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. ఇసుక అక్రమ వ్యాపారాన్ని అరికట్టాల్సిన అధికారులను మేనేజ్ చేస్తూ తమ కార్య కలాపాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ఓట్లు నమోదుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-అనకాపల్లి

18 సంవత్సరాల నిండిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం అనకాపల్లి రింగ్ రోడ్‌లో అవగాహన ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో ఇంతవరకు 12,68,900 ఓటర్లు నమోదు అయ్యారని తెలిపారు. జాబితాలను ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ప్రదర్శించడం జరిగిందన్నారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే సంబంధిత కార్యాలయాల్లో ఫిర్యాదు చేయాలన్నారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రతి ఒక్కరి హక్కు అన్నారు. ఈనెల 10 నుంచి ప్రతి పోలింగ్ స్టేషన్లో డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఉంటుందన్నారు. నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ, ఆర్డీవో చిన్నికృష్ణ, ఎంఈఓ దివాకర్, తహశీల్దార్ శ్రీరామ్మూర్తి, ఏఎంఏఎ హిమ శేఖర్, ఏఎంఏఎ ఇంగ్లీష్ మీడియం, జీవిఎంసీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ లింగేశ్వరరెడ్డి

భావి ప్రగతి కోసం స్వీయ మూల్యాంకన

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రతి విద్యార్థి తమ భావి ప్రగతి కోసం స్వీయ మూల్యాంకన విధానం ఎంతో ఉపకరిస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వర రెడ్డి అన్నారు. పదో తరగతి విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలపై స్వీయ మూల్యాంకన చేసుకునే దిశగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ విధానాన్ని రూపొందించడం జరిగిందని చెప్పారు. ఇందులో భాగంగా 84 మంది నిష్ణాతులైన కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. విద్యార్థులు తమకు కావలసిన సబ్జెక్టుపై క్లిక్ చేయగానే అందుకు సంబంధించిన బహుళైచ్ఛిక ప్రశ్నలు, సమాధానాలు ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదు

ప్రజాశక్తి-అనకాపల్లి : రోడ్డు డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని కార్పొరేటర్ మందపాటి సునీత హెచ్చరించారు. స్థానిక శారద కాలనీలో 37 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సిసి డ్రైనేజీ, రోడ్డు పనులను ఆమె వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజుతో కలిసి బుధవారం పరిశీలించారు. ఆమె వెంట వైసిపి నాయకులు గైపూరి రాజు, కోన ఉమా, డొంక సత్తిబాబు, అధికారులు ఉన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి

ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈనెల 12న విశాఖలో నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కార్పొరేటర్ మందపాటి సునీత, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు పిలుపునిచ్చారు. స్థానిక 82 వ వార్డు సచివాలయంలో బుధవారం వైసిపి వార్డు శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

తహశీల్దారుగా గంగాధరరావు నియామకం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండల తహశీల్దారుగా పివిఎల్‌ఎన్ గంగాధరరావును నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం గంగాధరరావు అనకాపల్లి ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో 2011లో ఆయన సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దారు అనకాపల్లిలో పనిచేశారు. గంగాధరరావు గురువారం బాధ్యతలు చేపట్టనున్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు

ప్రజాశక్తి- అచ్యుతాపురం : ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు హెచ్చరించారు. మండలంలోని ఇరువాడ గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి తిరిగారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని కొంతమంది వ్యక్తులు తమ సమస్యల పరిష్కరించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనికి ఆయన స్పందించి అక్కడే ఉన్న వాలంటరీ, సచివాలయ సిబ్బందిని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించకపోవడానికి కారణం ఏమిటని నిలదీశారు. ఇటువంటి జాప్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, గ్రామ సర్పంచ్ పిల్ల సతీష్, కోన బుజ్జి, దేశంశెట్టి శంకర్రావు, పి వాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

ప్రధాని మోడీ విశాఖ పర్యటన నేపథ్యంలో

11న జిల్లా వ్యాప్తంగా నిరసనలు

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం పిలుపు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటనను నిరసిస్తూ ఈనెల 11న జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రామానాయుడు కార్మిక కర్షక నిలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, రైల్వే జోన్ వంటి వాటిని అమలు చేయకుండా కేంద్ర బిజెపి ప్రభుత్వం ద్రోహం చేసిందని, దీనిని నిరసిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడ్డ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ఎలాగైనా ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందన్నారు. రాజధాని నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా మోసగిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజలంతా తమ వ్యతిరేకతను తెలియజేయాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న లోకనాథం, చిత్రంలో అప్పలరాజు

కేంద్ర ప్రభుత్వ విధానాలపై బ్యాంకు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, బ్యాంకుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక ఉడ్‌పేట యూనియన్ బ్యాంకు శాఖ ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. బ్యాంకు ఉద్యోగుల ఆకస్మిక బదిలీలను ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు యూనియన్ లీడర్ కాండ్రేగుల హరికృష్ణ, హర్షత్, నాగ ప్రసన్న, సౌమ్య, శ్రీనివాసరావు, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న యూనియన్ బ్యాంకు ఉద్యోగులు

స్టీల్‌ప్లాంట్ కార్మికుల అరెస్టులకు నిరసనగా రాస్తారోకో

రాస్తారోకో చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి- అనకాపల్లి

విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ బుధవారం అఖిలపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి ప్రభావతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రకటనను నిరసిస్తూ కార్మికులు పాదయాత్ర చేస్తుంటే వారిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ ప్రధాని మోడీ ఈనెల 12న విశాఖ పర్యటన నేపథ్యంలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేస్తూ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ఒక్క మాట కూడా మాట్లాడకుండా మోడీకి ఘన స్వాగతం పలకడం ఆక్షేపిస్తున్నామని పేర్కొన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ దేశానికి పట్టుకొమ్మలుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ తదితరులు

సిసి డ్రైనేజీలకు శంకుస్థాపన

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల పంచాయతీ పరిధి ప్రమీల నగర్లో సీసీ డ్రైనేజీలకు బుధవారం సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.4 లక్షలతో ఈ డ్రైనేజీలను నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దిలీప్ కుమార్, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పిడి గాంధీ, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్య కుమారి చంద్రశేఖర్, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి చంటి, బిఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ పీలా విశ్వేశ్వరరావు, వార్డు మెంబర్లు సత్యారావు, రవ్వ భవాని శ్రీను, చదరం చిన్న, వెలగా మోది నాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ గొంతిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర చర్చా వేదిక నాయకులు రాజేష్

అగ్రవర్ణాలకు రిజర్వేషన్లతో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం

ప్రజాశక్తి -అనకాపల్లి : అగ్రవర్ణాల్లో ఉన్న పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పుతో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతుందని ఉత్తరాంధ్ర చర్చ వేదిక నాయకులు బుద్ధ రాజేష్ అన్నారు. స్థానిక ఉత్తరాంధ్ర చర్చా వేదిక కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వద్దని ప్రకటించిందని, అయితే ప్రస్తుతం ఇచ్చిన తీర్పులో 50 శాతానికి లోబడి ఇచ్చిందా, 50 శాతానికి మించి ఇచ్చిందా అన్నది స్పష్టం చేయాలని కోరారు. ఒకవేళ 50 శాతం లోపు ఇచ్చి ఉంటే దేశంలో ఉన్న 130 ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

గ్రోయిన్లకు మరమ్మతులు చేయాలని నిరసన

ప్రజాశక్తి -అనకాపల్లి : శారద నదిలో శిథిలమైన గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టి వృథాగా పోతున్న సేద్యపు నీటిని కాపాడాలని కోరుతూ తుమ్మపాల ఎంపిటిసి సభ్యులు చదరం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కొణతాల అప్పలరాజు, కొణతాల నాగేశ్వరరావు, చదరం గోవిందు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని ఎర్రవరం గ్రామంలో బుధవారం గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు కార్యక్రమం ఘనంగా సాగింది. గ్రామ రామాలయం వద్ద ప్రారంభించిన సారె పురవీధులలో ఊరేగించారు. వందలాదిమంది మహిళలు తయారు చేసిన పిండి వంటలు, మిఠాయిలు, పండ్లు, పూలు, అరటిగెలలు పట్టుకొని గ్రామం అంతా తిరిగారు. ఈ సందర్భంగా మందు గుండు పేల్చారు. బాజా భజంత్రీలు మోగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంగిరెడ్డి లక్ష్మి రాము, ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్ సిరస పల్లి సత్యనారాయణ, ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ నర్సాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సారె ఊరేగిస్తున్న గ్రామస్తులు

అక్రమంగా చేపలు చెరువుల నిర్వహణపై

మత్స్యశాఖ జెడికి సిపిఎం వినతి

ప్రజాశక్తి - దేవరాపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో నిబంధనలు గాలికొదిలేసి జిఒ 7,15ను పక్కన పెట్టి యథేచ్ఛగా అక్రమంగా చేపలు చెరువులు నిర్వహణపై సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న బుధవారం మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావుకు వినతిపత్రం అందజేశారు. దేవరాపల్లి మండలంలో మామిడిపల్లి, ఎం.అలమండ, కొత్తపెంట తారువ, చేనులపాలెం, పెదనందిపల్లి, కలిగొట్ల, బోయిల కింతాడ, తిమిరాం, మారేపల్లి, దేవరాపల్లి తదితర ప్రాంతాల్లో అక్రమ చేపల చెరువులు నిర్వహిస్తున్నారని తెలిపారు. రాజకీయ నాయకుల సహకారం ఉండడంతోనే సుమారు వెయ్యి ఎకరాల వరకు పంట భూములు చేపల చెరువులుగా మారిపోయాయని పేర్కొన్నారు. దేవుని మాన్యం, అసైన్డ్ భూములు సైతం వదిలి పెట్టడం లేదన్నారు. ప్రజలకు, పర్యావరణానికి నష్టం కలిగించే పశుమాంసం, చికెన్ వ్యర్థాలతో ఈ చెరువుల్లో చేపల పెంపకం చేపడుతున్నారని తెలిపారు. వెంటనే అక్రమ చేపల చెరువుల యజమానులపై క్రిమినల్ కేసులు పెట్టాలని, అనుమతుల్లేని చెరువులను వెంటనే మూసి వేయాలని కోరారు.

దీనికి స్పందించిన మత్స్యశాఖ జెడి మండలంలోని ఏ ఒక్క చెరువుకు అనుమతులు లేవని, కొంతమంది దరఖాస్తులు పెట్టారని, ఈ ప్రాంతం తెల్లచేపలు పెంపకం చేపడితేనే అనుమతులిస్తామని తెల్చిచెప్పామని పేర్కొన్నారు. అయినా వారికి నచ్చిన చేపలను పెంచుతూ, అనుమతులు లేకుండా చెరువులు తవ్వేస్తున్నారని, వీటిల్లో వ్యర్థ పదార్థాలు వాడుతున్నట్లు గతంలో తమ దృష్టికి వస్తే వాహనాలు సీజ్ చేసి కేసులు పెట్టామని తెలిపారు. అయినా వారి తీరు మారలేదని, త్వరలోనే దాడులు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జెడి హామీ ఇచ్చినట్లు వెంకన్న తెలిపారు.

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు వెంకన్న

గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో విలీనం చేయాలి

మాట్లాడుతున్న మాజీ విసి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి -చోడవరం

నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో విలీనం చేయాలని కోరుతూ ఏపీ ఆదివాసీ హక్కుల సాధన సంఘం, ఆర్క్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఆర్క్ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నయ యూనివర్సిటీ మాజీ విసి ఎం.ముత్యాల నాయుడు మాట్లాడుతూ ఈ నెల 15లోగా నాన్ షెడ్యూల్డ్ ఏరియాలోని షెడ్యూల్డ్ గ్రామాల వివరాలు అందించమని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చినట్లు చెప్పారు. మైదాన ప్రాంతంలో ఉన్న గిరిజన గ్రామాలను విలీనం చేయకపోవడం వల్ల గిరిజనులు ప్రభుత్వ అందించే వివిధ సంక్షేమ పథకాలు, ఉద్యోగాలు వంటివి రాకుండా పోతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్క్ డైరెక్టర్ బీఎస్ ప్రసాద్, రిటైర్డ్ లెక్చరర్ ఎన్ దేముడు, రిటైర్డ్ ఆర్డిఓ తిరుపతిరావు, సియాద్రి శ్రీనివాసరావు, పివి రమణ, కొండలరావు, తో పాటు సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

భూ రీ సర్వే పనులపై జెసి సమీక్ష

ప్రజాశక్తి - కె.కోటపాడు

జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కల్పనాకుమారి బుధవారం మండలాన్ని సందర్శించి భూముల రీ సర్వేపై సమీక్ష నిర్వహించారు. మండలంలో మలివిడత 10 గ్రామాల్లో భూముల రీసర్వే పనులు ప్రారంభమైన నేపథ్యంలోఆమె వారాడ గ్రామాన్ని సందర్శించారు. భూముల రీసర్వే తీరుపై రైతులతో మాట్లాడారు. రైతులు సంతృప్తి వ్యక్తం చేశారని జేసీ తెలిపారు. అనంతరం ఇక్కడ తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే ప్రగతిపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలిదశ రీసర్వేలో అనుభవాల దృష్ట్యా రెండో దఫా రీసర్వేలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా రీసర్వే జరుపుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.రమేష్ బాబు, ఉపతహశీల్దార్ డి.రమేష్ బాబు, ఆర్ఐలు, విఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ

స్థానిక ఏపీ వైద్య విధాన పరిషత్ 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఆకస్మికంగా సందర్శించారు. తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో కె.జె.పురంలో ఇంటికి వెళ్తున్న బాలింతను పలకరించి వైద్యసేవల గురించి అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మహిళా వార్డును సందర్శించారు. 50 పడకల కోసం నిర్మిస్తున్న భవనాల పనులను జేసీ పరిశీలించారు. ల్యాబ్ వద్ద గర్భిణులతో మాట్లాడారు. అంగన్వాడి కేంద్రం నుంచి పోషకాహారం అందుతుందా అని ప్రశ్నించారు. ఫార్మసీని సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు పట్ల జెసి కల్పనాకుమారి సంతృప్తి వ్యక్తం చేశారు.

సిహెచ్‌సి వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జెసి కల్పనాకుమారి

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకంలో భాగంగా 33 గర్భిణులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పినకోట వైద్యాధికారులు డి.రూప్ చంద్, వెంకటేష్ తెలిపారు. నాలుగు సచివాలయాల నుంచి గర్భిణులకు రక్త పరీక్షలు, బిపి, బరువు వివిధ పరీక్షలు నిర్వహించి, హైరిస్క్‌గా నలుగురు గర్భిణులను గుర్తించి వారికి ఉన్నత వైద్యం కోసం పంపించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి రవి, పర్యవేక్షకురాలు సావిత్రి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసరావు, సిబ్బంది పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని వినతి

ప్రజాశక్తి -చోడవరం : చోడవరంలో శ్మశాన వాటికలను పంచాయతీ అభివృద్ధి చేయాలని స్థానిక పంచాయతీ అధికారి నారాయణరావుకు సిపిఐ కార్యకర్తలు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ ఏరియా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ చోడవరంలో పంచాయతీలో నాలుగు శ్మశాన వాటికలు ఉన్నాయని, అవి పూర్తిస్థాయిలో మొక్కలు పెరిగిపోయి చోడవరం వ్యర్థాలతో నిండి ఉన్నాయని తెలిపారు. వెంటనే వాటిని బాగు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి శంకర్రావు, కర్రి శ్రీనివాసరావు బొబ్బిలి రామకష్ణ, కామరెడ్డి శీను రొంగలి సత్తిబాబు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓట్లకు 1272 దరఖాస్తులు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 1272 మంది పట్టభద్రులు ఓటు కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు తహశీల్దార్ బి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో 1149 మంది, ఆఫ్ లైన్‌లో 118 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. దరఖాస్తులు పరిశీలన చేసిన తర్వాత సోమవారం తుది జాబితా నోటీస్ బోర్డులో ఉంచుతామని చెప్పారు.

అయ్యన్నకు సంఘీభావం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడుకు బుధవారం ఆయన స్వగ్రామంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, మండల శాఖ అధ్యక్షులు జనపరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అతనికి సాలువా కప్పి పూలదండతో సత్కరించారు. అయ్యన్నను కలిసిన వారిలో రాజాన నానాజీ, కూనిశెట్టి రమణ, పుర్రె శ్రీనివాస్ యాదవ్, రాము రాము ప్రసాద్, కాళ్ళ రాజు, ఒత్తుల మాధవరావు ఉన్నారు.

ఆయుర్వేదంతో పలు రోగాలకు చెక్

ప్రజాశక్తి- అనకాపల్లి : ఆయుర్వేదంలో దీర్ఘకాలిక రోగాలకు సైతం పరిష్కార మార్గాలు ఉన్నాయని స్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రి ఆయుర్వేద వైద్యులు కే పావని అన్నారు. స్థానిక భీమిని గుమ్మం జీవీఎంసీ అంబేద్కర్ ఉన్నత పాఠశాలలో బుధవారం జీవీఎంసీ 9వ వార్డు సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : ఈనెల 26వ తేదీ నుండి 28వ తేదీ వరకు రాజమండ్రిలో జరిగే అఖిల భారత భవన నిర్మాణ కార్మిక సంఘం ఏడవ జాతీయ మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ పిలుపునిచ్చారు. మండలంలోని నాగులపల్లి గ్రామంలో బాల గణపతి భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశం బుధవారం జరిగింది. ముందుగా మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు.నాయుడు మల్లికార్జున్ రావు, మారిశెట్టి వర, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

వరి పంటలపై పందుల దాడి

పొలంలో సంచరిస్తున్న పందులు

ప్రజాశక్తి- కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట పరిసర ప్రాంతాల్లో పందులు స్వైర విహారం చేయడం తో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. కొత్తకోట గ్రామ సమీపంలో ముంతమామిడి కట్టు, గజాలకట్టు, కోళ్ల ఫారం, గుమ్మడి, భీమరాతి, వెల్లంకి గట్రేడి, కోట వారి వరి పొలాలలో పందులు స్వైర విహారం చేసి నాశనం చేస్తున్నాయి. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉండటంతో పందుల అలజడితో తీవ్ర నష్టం వాటిల్లితోంది. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన పంట ఇప్పుడు పందుల బారిన పడడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పందుల పెంపకం దారులుకు పలుమార్లు చెప్పినా పట్టించు కోలేదని రైతులు భీమరాతి అప్పారావు, ఉగ్గిన అప్పారావు, కొప్పు శ్రీను, గట్రేడి ఆనందరావు, కోట అప్పారావు, సత్తిబాబు తదితరులు వాపోయారు. పంట దశలో పందులు నాశనం చేయడంతో దిక్కు తోచని స్థితిలో ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు, ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పందుల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ సమస్య పై పంచాయతీ కార్యదర్శి కృష్ణ మోహన్‌ను సంప్రదించగా మరో మూడు రోజుల్లో పందుల ఏరి వేతకు చెన్నై నుంచి బృందం వస్తోందని చెప్పారు. పెంపకందారులకు ఇప్పటికే సమాచారం అందజేశామని కార్యదర్శి పేర్కొన్నారు..

దెబ్బతిన్న వరి పొలం

ధర్నాలో కూర్చున్న మత్స్యకారులు

344వ రోజూ మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి:హెటిరో పైప్‌లైన్ పూర్తిగా తొలగించాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. హెటిరో పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకార జేపీసీ ఆధ్వర్యంలో చేపట్టిన శాంతియుత మహా ధర్నా బుధవారం నాటికి 344వ రోజుకు చేరింది. 344 రోజుల నుండి పైప్‌లైన్‌కి వ్యతిరేకంగా తామంతా ఆందోళన చేస్తున్నప్పటికీ నేటి వరకు సమస్య పరిష్కారానికి మార్గం చూపకపోవడం దారుణం అన్నారు. సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మత్స్యకారులంతా ఐక్యంగా కంపెనీ యాజమాన్యం, ప్రభుత్వం పైన మరింతగా ఒత్తిడి తీసుకొచ్చి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు మైలపల్లి బాబ్జీ, మైలపల్లి జాను, వాసపల్లి నూకరాజు, శ్రీను, గోసల అంజి, గోసల వెంకటేష్, చొడేపల్లి రాజు, పిక్కి రమణ, కారే కోదండరావు, జనసేన పార్టీ విశాఖపట్నం (రూరల్) ప్రోగ్రాం కమిటీ మెంబర్ పిక్కి స్వామి పాల్గొన్నారు.

పైలాకు హారతి ఇస్తున్న పురోహితులు

నరసింహస్వామిని దర్శించుకున్న పైలా

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని అర్జునగిరి గ్రామం లో వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారణను ఘనంగా నిర్వహించారు. మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు పెంటకోట అమ్మతల్లి నాయుడు, మాజీ ఎంపిటిసి కసిరెడ్డి గణపతి, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు జాజిమొగ్గల ప్రసాద్, మాజీ సర్పంచ్ యామల లక్ష్మణ్, జాజి మొగ్గల సత్యనారాయణ, గూడెపు కామరాజు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -నక్కపల్లి:స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారం తో సమావేశానికి హాజరు కావాలని, సభ్యులందరూ పాల్గొనాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని చిన రామభద్రపురంలో ఆంజనేయ స్వామి ఆలయ పదవ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆలయాన్ని అందంగా తీర్చి దిద్దారు. పూల అలంకరణతో ముస్తాబు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణతో పాటు పలువురు స్వామిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

క్రీడా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-దుంబ్రిగూడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డివిజన్ స్థాయి పోటీలకు కిల్లోగూడ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థినిలు 18 మంది ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కళావతి చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈనెల 11న పాడేరులో జరిగే డివిజన్ స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారరన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-మాడుగుల:వైయస్సార్ ఫ్యామిలీ క్లినిక్ కార్యక్ర మంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని సచివాలయం 3 పరిధిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. బిపి, షుగర్ తదితర వ్యాధుల నిర్ధారణ చేశారు. పలువురికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ఎంపీపీ పెదబాబు, సర్పంచ్ కళావతి, కేజె పురం పీహెచ్సీ వైద్యాధికారి ప్రసాద్ పాత్రుడు, వైసిపి నేతలు వరహాలు, మోదకొండ, శిలామంతుల వాసు, జ్యోతి, కుక్కర శ్రీధర్, ఉనీషా తదితరులు పాల్గొన్నారు.

హాజరైన వైద్యులు, సిబ్బంది

పరాయి పంచన పశువైద్యశాల

పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో తంగేడు గ్రామంలో పశువైద్యశాలకు భవనం లేక పోవడంతో విశాఖ డైరీ పాల సేకరణ కేంద్రం పంచన నడుస్తోంది. గతంలో పశువైద్య కేంద్రం ఉండేది. ఆ భవనం శిథిలావస్థకు చేరింది. దీని నిర్మాణం చేపట్టాల్సి నేతలు

విశాఖ డెయిరీ గదిలో ఉన్న పశువైద్య శాల

పట్టించుకోలేదు. దీంతో పశు వైద్య సిబ్బంది సహా రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. తంగేడు గ్రామానికి సంబంధించి అత్యధిక శాతం పశుపోషకులు ఉన్నారు. దీంతో పశువులకు ఏమాత్రం రోగాలు సంక్రమించిన సరైన వైద్యం అందక పోవడంతో విశాఖ డైరీ సిబ్బందిని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకుంటుంది. దీనికి తోడు ఇక్కడ పని చేస్తున్న పశువైద్యులను పక్క మండలం మాకవరపాలెం ఇన్చార్జి వేయడంతో రైతులు మరింత ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి తంగేడు గ్రామానికి పశువైద్యశాల నిర్మాణం చేపట్టాలని, అదేవిధంగా వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని పాడి రైతులు కోరుతున్నారు.

జనసేన రాష్ట్ర నేతల పరామర్శ

ప్రజాశక్తి-గొలుగొండ:జనసేన పార్టీతోనే నిస్వార్థ రాజకీయాలు సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు తమ్మిరెడ్డి శివశంకర్, బొలిశెట్టి సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండలంలోని పాతకేడిపేటలో ఇటీవల మరణించిన జనసేన కార్యకర్తలు అనిశెట్టి శివ, వీరుల శివల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆత్మీయ సభలో వారు మాట్లాడుతూ, భారతదేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా కార్యకర్తలకు రూ. 5లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. పార్టీ అధికారంలో లేకపోయినా కార్యకర్తలు, వీరమహిళలు, జనసైనికులపై పవన్‌కళ్యాణ్‌కు ఎంత ప్రేమ ఉందో దీని బట్టి అర్థం అవుతుందన్నారు. ముందుగా కేడీపేటలో అల్లూరి సీతారామరాజు పార్కును సందర్శించి అల్లూరి సమాధులకు నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర, నాయకులు చక్రవర్తి, అద్దేపల్లి గణేష్, దొరబాబు, మల్లాడి శ్రీను పాల్గొన్నారు.

హాజరైన రాష్ట్ర నాయకులు

ములియాపుట్టులో 'బాదుడే బాదుడు'

ప్రజాశక్తి -హుకుంపేట: పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని టిడిపి ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర డిమాండ్ చేశారు. మండలంలోని ములియాపుట్టు గ్రామ పంచాయతీ లో పర్యటించి బాదుడే బాదుడు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెరిగిన ధరలతో ప్రజలపై అధిక భారం పడుతుందని ఆయన అన్నారు. కరోనా కష్టకాలం తర్వాత సామాన్య ప్రజలు కోలుకోలేని పరిస్థితులు ఉండగా నిత్యావసర సరుకులు, బస్ చార్జీలు, పెట్రోల్‌చ డీజిల్, ధరలు పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలను బాధించడం సరికాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోమెలి లక్ష్మయ్య, ఉప సర్పంచ్ కిరసాని చిన్నతల్లి పాల్గొన్నారు.

నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాసరావు

వాసవి క్లబ్ అంతర్జాతీయ కో-ఆర్డినేటర్‌గా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మాడుగుల: వాసవి క్లబ్ అంతర్జాతీయ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా మాడుగులకు చెందిన శ్రీనాథ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇప్పటివరకు వాసవి క్లబ్ రీజనల్ చైర్మన్‌గా ఉన్న ఆయన సేవలు గుర్తించి అంతర్జాతీయ స్థాయిలో సేవలు వినియోగించు కోవాలన్న ఉద్దేశంతో నూతన పదవిని అప్పగించారు .ఈ మేరకు జిల్లా గవర్నర్ ఎస్ఎస్ శ్రీనివాసరావు శ్రీనివాసరావుకు సోమవారం నియామక పత్రం అందించారు. వాసవి క్లబ్‌లో తనకు పదోన్నతి లభించడంపై వాసవి క్లబ్ నిర్వాహకులకు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

సిద్ధమైన మార్ట్

వైఎస్ఆర్ చేయూత మార్ట్ సిద్ధం

ప్రజాశక్తి-మాడుగుల:నాణ్యమైన నిత్యావసర సరుకులు అతి తక్కువ ధరకు ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ మండల కేంద్రంలో అందుబాటులోకి రానుంది. స్థానిక గ్రామపంచాయతీ కమ్యూనిటీ భవనంలో ఈ మార్ట్‌ను సిద్ధం చేశారు. సుమారు 40 లక్షల రూపాయల వ్యయంతో ఏసీలతో పాటు సరుకులు ఉంచేందుకు అవసరమైన ఫర్నీచర్ సిద్ధం చేశారు. నిత్యావసర సరుకులతో పాటు అన్ని రకాల కిరాణా సరుకులు ఈ మార్ట్‌లో విక్రయించనున్నారు. అతి త్వరలో ఈ మార్ట్‌ను ప్రారంభిస్తామని మహిళా మార్ట్ అధ్యక్షురాలు అడపా అరుణ, కార్యదర్శి ఇమంది అంబిక, మార్ట్ సిసి సోమేశ్వరరావు తెలిపారు.

మాట్లాడుతున్న అయ్యన్న

అయ్యన్నకు సంఘీభావం

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణరెడ్డి బుధవారం నర్సీపట్నంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడును కలిసి సంఘీభావం తెలిపి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో మంచి నాయకుడిగా అయ్యన్న పేరు తెచ్చుకున్నారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అందరి మన్ననలు పొందార న్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపిగా పని చేసి చేశారన్నారు. జగన్మోహన్‌రెడ్డిని ఎవరైనా విమర్శించినా, ప్రశ్నించినా తట్టుకోలేక అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. ఒక్క చాన్సు అంటూ అధికారంలోకి వచ్చి రాజధానులను మార్చడానికి చూస్తున్నారని పేర్కొన్నారు. రాజధాని పేరుతో భూము లను కాజేయాలని చూస్తున్నారని విమర్శించారు.

కాలువను నిర్మిస్తున్న నేతలు

10వ వార్డులో కాలువ నిర్మాణం

ప్రజాశక్తి-మాడుగుల:కాలువలు లేక మురుగునీడితో ఇబ్బంది పడుతున్న ప్రజల కష్టాలను చూసి జనసైనికులు స్పందించారు. మాడుగుల పదవ వార్డులో కాలువ నిర్మాణాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో జనసేన నేత రోబ్బా మహేష్ ఆధ్వర్యంలో రూ.25వేలతో బుధవారం కాలువ నిర్మించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు కోళ్ల చిన్న, రాకెటి నూకరాజు, కూడా మహేష్, గళ్ళ గణేష్, ఎల్లపు రమేష్, వేపాడ నాగు, సురేష్, మంచాల శివ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తులను చూపుతున్న నిర్వాహకులు

ఆయుర్వేద ఉత్పత్తులపై అవగాహన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :ఆయుర్వేధ ఉత్పత్తులను స్వీకరించి ఆరోగ్యంగా జీవించాలని ఇంటర్నేషనల్ మార్కెటింగ్ కార్పొరేషన్ (ఐఎంసి) నిర్వాహకులు ఎ.ప్రసాద్ సూచించారు. పెదపడ్డేపల్లి నర్సరీ వద్ద ఏర్పాటు చేసిన ఆర్గానిక్ స్టాల్స్ వద్ద ఆర్గానిక్, హెర్బల్, ఆయుర్వేదిక్‌తో ఉత్పత్తి చేసిన నిత్యావసర వస్తువులపై అవగాహన కల్పిస్తూ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ప్రకృతి వనరులను సేంద్రియ పద్దతులలో పండించిన పంటలను, వనమూలికలు, ప్రాచీన భారతీయ ఆయుర్వేద ఉత్పత్తులను అందుబాటులో తీసుకువచ్చి స్టాల్స్‌లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలందరు ఈ స్టాల్స్‌లో సేంద్రియ పద్దతులలో తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆరోగ్యంగా జీవించాలని ప్రసాద్ కోరారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తా

పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ

ప్రజాశక్తి- సీలేరు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. బుధవారం సీలేరు వచ్చిన ఆమె పట్టభద్రులను కలిసి తనకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలో ఉన్న జీవ నదులపై ప్రాజెక్టులు నిర్మించకపోవడం వల్లే ఉత్తరాంధ్ర వెనుకబాటుకు కారణమని చెప్పారు. దీంతో ఇక్కడ పనుల్లేక రైతులు కూలీలు వలసబాట పడుతున్నారన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి దశాబ్దాలు గడిచినా నేటికీ పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఇక్కడున్న పట్టభద్రులు వేరే పట్టణాలకు వలస పోతున్నారన్నారు. వలసలను అరికట్టడానికి కొత్త ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడంతో పాటు ఉపాధి ఇస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. తనను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే శాసనమండలిలో ఉత్తరాంధ్ర వాణిని వినిపిస్తానని, ఈ ప్రాంతంలో పోరాడే వారి తరుపున నిలబడతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.త్రిమూర్తులు రెడ్డి, గాలకొండ ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు పాల్గొన్నారు.

విలేకర్లతో మాట్లాడుతున్న రమాప్రభ

వాడీవేడిగా మండల సమావేశం

▶▶ అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం ▶▶ వాయిదా వేయాలని పట్టు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల సమావేశ మందిరంలో బుధవారం ఎంపిపి అప్పలనాయుడు, జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశం వాడి వేడీగా జరిగింది. పలు శాఖల అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడం పట్ల అధికార, ప్రతిపక్ష నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ, విద్యుత్ శాఖ, విద్యాశాఖ, ఉపాధి హామీ సహా తాండవ కాలువ అధికారులు హాజరు కాకపోవడం పట్ల సభ వాయిదా వేయాలన్న అంశాన్ని సభ్యులు లేవనెత్తారు. దీంతో, ఎంపిడివో చంద్రశేఖర్ కలుగజేసుకొని సమావేశానికి డుమ్మా కొట్టిన అధికారులకు నోటీసులు అందజేస్తామన్నారు.

ఖరీఫ్ పంట చివరి దశకు చేరుకున్న సమయంలో తాండవ నీరు అందకపోవడం పట్ల నీలిగుంట సర్పంచ్ వరహాల బాబు సభ దృష్టికి తీసుకువెళ్లారు. ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యం వహించడం, సభకు హాజరు కాకపోవడంపై బికెపల్లి ఎంపిటిసి సభ్యులు రాంబాబు, చిన్న బొడ్డేపల్లి సర్పంచ్ శివప్రసాద్ సంబంధిత శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ ఏపీవో సమావేశానికి డుమ్మా కొట్టి చౌడువాడలో ఉపాధి హామీ గ్రామ సభకు హాజరైనట్లు తెలుసుకున్న ఎంపిడివో ఫోన్ ద్వారా సమాచారం అందించి తక్షణమే సభకు హాజరు కావాలని చెప్పారు. దీంతో, ఆలస్యంగా వచ్చిన ఏపీవో గంగు నాయుడుపై పలువురు ఎంపిటిసి, సర్పంచ్‌లు పలు సమస్యలపై నిలదీస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సహనం కోల్పోయిన ఏపీవో భావోద్వేగానికి లోనై గౌరవ సభ్యుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పలువురు సభ్యులు తక్షణమే ఆయనను సంబంధిత శాఖ అధికారులకు సరెండర్ చేయాలని పట్టుబట్టారు.

అనంతరం ఈఓపిఆర్డి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, ఇటీవల గ్రామ పంచాయతీలకు వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులతో విద్యుత్ బకాయిలు

మండల సర్వసభ్య సమావేశంలో నిలదీస్తున్న సభ్యులు

చెల్లించాలని సభ దృష్టికి తీసుకువెళ్లడంతో, వచ్చిన కొద్దిపాటి సొమ్ము కరెంటు బకాయిలు చెల్లిస్తే గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికుల వేతనాలు తదితర బకాయిలు ఎలా చెల్లించాలని తంగేడు గ్రామ సర్పంచ్ శివప్రసాద్ సహా పలువురు సర్పంచులు నిలదీశారు. గ్రామీణ నీటి సరఫరా ఇంజనీరు కరుణ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న జల్ జీవన్ మిషన్ పనుల ద్వారా ఇంటింటికి కుళాయి పనులపై వివరిస్తున్న తరుణంలో, కొడవటిపూడి సర్పంచ్ అప్పారావు, ఎంపిటిసి సభ్యులు సూర్యప్రకాష్ కలుగజేసుకుని ముందుగా ట్యాంకు నిర్మాణం చేపట్టకుండా పైపులైను పనులు చేయడంతో ఉపయోగం లేదని ఆమెను నిలదీశారు. అనంతరం కలుగజేసుకున్న జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి ఇంటింటికి కొళాయి పథకంలో పలు గ్రామాలలో లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని అటువంటివి జరగకుండా చూడాలన్నారు.

వైస్ ఎంపిపి చెక్క సుజాత మాట్లాడుతూ, సుంకపూరు, జల్లూరు గ్రామాలకు సంబంధించి ఎటువంటి అధికారిక అభివృద్ధి కార్యక్రమాలుకు తమకు సమాచారం తెలియజేయలేదని, సచివాలయ, మండల పరిషత్ సిబ్బంది తమ పట్ల వహిస్తున్న నిర్లక్ష్యం పై సభలో ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత శాఖ అధికారులకు స్పందన ద్వారా ఫిర్యాదు చేస్తానన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు చేపట్టిన చేపడుతున్న అభివృద్ధి పనులు సభ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల మండల అధికారులు, పలువురు సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

రూ.500 కోట్ల భూదోపిడీ

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖ నగరం నడిబొడ్డులో క్రిస్టియన్ చారిటీకి చెంది రూ.500 కోట్ల విలువైన సిబిసిఎన్‌సి స్థలాన్ని వైసిపి పార్లమెంట్ సభ్యుడు ఎంవివి సత్యనారాయణ, స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ జి.వెంకటేశ్వరరావు(జీవీ) కలిసి దోచుకుంటున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. బుధవారం నగరంలోని ఒక హోటల్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 18 సంస్థల పేరుతో అదే స్థలంలో జివిఎంసి పన్నులు వేయడానికి గతంలో డిసిఆర్‌గా పనిచేసిన రమేష్ కుమార్ రూ.80 లక్షలు లంచం తీసుకొని అడ్డగోలుగా విఎల్ టి టాక్స్‌కు బదులు, తప్పుడు డోర్ నెంబర్లతో రెసిడెన్స్ టాక్స్ వేసేశారని ఆరోపించారు. ఈ స్థల వివాదం ప్రస్తుతం కోర్టులో ఉందని, దానిని దిక్కరిస్తూ జివిఎంసి అధికారులు కేవలం 18 రోజుల్లో రూ.63 కోట్ల విలువైన టిడిఆర్ సర్టిఫికెట్లను ఏ విధంగా ఇచ్చారని ప్రశ్నించారు. 2019 నుంచి సంపత్ వినాయక రోడ్డులో మాస్టర్ ప్లాన్ కోసం ఎటువంటి రోడ్డు విస్తరణ జరగలేదని, ఎవరి దగ్గరా స్థలాలు తీసుకోలేదని చెప్పారు. అయినా అలా జరిగినట్లు చూపించి అప్పటి డిసిఆర్ రమేష్ కుమార్ లంచం తీసుకొని టిడిఆర్‌లు ఇచ్చేశారన్నారు. కోర్టు వివాదాల్లో ఉన్నప్పటికీ టైటిల్ డీడ్ కోసం సిబిసిఎన్‌సి క్రిస్టియన్ ఆస్తుల సుమారు 1900 గజాల స్థలానికి దొడ్డి దారిన నాలుగు రెట్ల టిడిఆర్ జివిఎంసిలో కొట్టేశారని ఆరోపించారు. కోర్టు వివాదాల్లో ఉన్న క్రిస్టియన్ మైనార్టీ ఆస్తులకు అర్థాంతరంగా రూ.100 కోట్ల విలువ గల టిడిఆర్‌లు 18 రోజుల్లో ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ప్లాన్ అప్రూవల్ పూర్తిస్థాయిలో రాలేదని, డాక్యుమెంట్స్ పూర్తిస్థాయిలో సమర్పించలేదని జివిఎంసి అధికారులే చెబుతున్నారని వివరించారు. విశాఖలో జగనన్న భూ దోపిడీ కార్యక్రమం పెద్ద స్థాయిలో జరుగుతున్నదని ఆయన ఆరోపించారు. రేడియంట్, దసపల్లా, హయగ్రీవ, ఇప్పుడు క్రిస్టియన్ మైనార్టీ భూములను కూడా కాజేస్తున్నారన్నారు. టిడిఆర్‌లను రద్దుచేసి, దానికి ప్లాన్ అనుమతులను నిరాకరించాలని కోరారు. ఈ దోపిడీ వ్యవహారంపై సిబిఐతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జనసేన రీజనల్ కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి, జనసేన నాయకులు శ్రీనివాస్ పట్నాయక్, కె.రూప, ఎడ్లపల్లి కళ,తదితరులు పాల్గొన్నారు.